

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం

అడ్మిన్ ఆఫీసు , ములుగు (గ్రామం & మండలం), సిద్దిపేట్ జిల్లా –తెలంగాణ

తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత ఉద్యాన సలహాలు

26 -11-2026 నుండి 02-12-2026

గత మూడు రోజులుగా వాతావరణం

గత మూడు రోజులుగా తెలంగాణలో పొడి వాతావరణం కొనసాగుతూ, అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురుసాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 29 నుండి 31 డిగ్రీల సెల్సియస్ మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 నుండి 22 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయి.

రానున్న ఐదు రోజుల వాతావరణ సూచన

తెలంగాణలో ఎక్కువగా పొడి వాతావరణం ఉండి, రాత్రి పూట చలి పెరిగే అవకాశం ఉంది. పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రతలు 31 నుండి క్రమంగా 28 డిగ్రీల సెల్సియస్ కు తగ్గుతాయి, అలాగే రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు 21 నుండి 16 -17 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోతాయి.

మొదటి రోజు (26/11/2026 08:30 గంటల నుండి 27/11/2026 08:30 గంటల వరకు)
తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

రెండవ రోజు (27/11/2026 08:30 గంటల నుండి 28/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

మూడవ రోజు (28/11/2026 08:30 గంటల నుండి 29/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

నాలుగవ రోజు (29/11/2026 08:30 గంటల నుండి 30/11/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

ఐదవ రోజు (30/11/2026 08:30 గంటల నుండి 01/12/2026 08:30 గంటల వరకు)

తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

కూరగాయలు

- పగటి పూట వెచ్చని వాతావరణం, రాత్రి పూట చల్లని ఉష్ణోగ్రతల మధ్య ఉండే తీవ్ర వ్యత్యాసం వల్ల ఉదయం వేళ మంచు ఏర్పడుతుంది. ఇది టమోటా, మిరప, బెండ మరియు తీగజాతి కూరగాయల పంటలలో బూడిద తెగులు, ఆకుమాడు తెగులు మరియు ఆకుమచ్చ తెగులు వంటి శిలీంధ్ర (ఫంగల్) వ్యాధులు వ్యాపించడానికి దోహదపడుతుంది.
- తెగుళ్లు సోకకముందే మొక్కలను రక్షించుకోవడానికి నీటిలో కలిగే గంధకం (Wettable Sulphur) లేదా ట్రైకోడెర్మా (Trichoderma) వంటి జీవ శిలీంధ్రనాశకాలను పిచికారీ చేయాలి. తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉంటే, ఆకుమాడు మరియు ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ (Mancozeb – లీటరు నీటికి 2.5 గ్రాములు) వంటి శిలీంధ్రనాశకాలను పిచికారీ చేయాలి.
- పగటి పూట పొడి వాతావరణం ఉండటం వల్ల తెల్లదోమ, పేనుబంక, తామర పురుగులు మరియు నల్లి (Mites) వంటి రసం పీల్చే పురుగుల వ్యాప్తి వేగవంతమవుతుంది. ఇవి మొక్కల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోతాయి. అంతేకాకుండా వైరస్ తెగుళ్లు కూడా వ్యాపిస్తాయి.
- పురుగుల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించి అరికట్టడానికి పసుపు మరియు నీలం రంగు జిగురు అట్టలను (Sticky Traps) అమర్చాలి. అలాగే ముందస్తు నివారణ చర్యగా వేప నూనెను (Neem Oil) పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే, వాటి నియంత్రణకు ఇమిడాక్లోప్రిడ్ (Imidacloprid – లీటరు నీటికి 0.3–0.5 మి.లీ.) మందును పిచికారీ చేయాలి.
- రబీ కూరగాయలు : క్యాబేజీ, క్యాలిఫ్లవర్ లో ఆకు పూత తినే పురుగు నివారణకు స్పినోసాడ్ 2.5% sc1.2 ml/ లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మిరప
    - వాతావరణ సూచనల దృష్ట్యా, తామర పురుగు ఉధృతిని ముందుగానే గుర్తించి నివారించడానికి ఎకరానికి 30–40 నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి.
    - ముందస్తు నివారణ చర్యగా కానుగ నూనె (Pongamia Oil) 5 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
    - లేత ఆకులు మరియు పూత భాగాలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

పండ్లు

- మామిడి
    - పక్షికన్ను తెగులు గమనించినట్లయితే, కార్బెండజిమ్ మందును 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
    - మామిడిలో పూత ప్రోత్సహించడానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) @ 10 గ్రా./లీ. లేదా మోనో పొటాషియం ఫాస్ఫేట్ (00-52-34) @ 10 గ్రా./లీ. + బోరాన్ @ 1.25 గ్రా./లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి.
    - డిసెంబర్ మొదటి వారంలో ఒక లేత తడి ఇచ్చినట్లయితే పూ మొగ్గలు బయటకి రావడానికి సహాయపడుతుంది.

- జామ

  - టీ దోమ మరియు గజ్జి తెగులు సంక్లిష్ట లక్షణాలను గమనించినట్లయితే, దెబ్బతిన్న పండ్లను, ఎండిన పుల్లలను సేకరించి నాశనం చేయాలి. అనంతరం ల్యాంబ్డా సైహలోథ్రిన్ @ 0.5–1.0 మి.లీ./లీటరు + (కార్బెండజిమ్ + మాంకోజెబ్) @ 2 గ్రా./లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
  - జామ తోటలో పండు ఈగను పర్యవేక్షించడానికి, ఎకరాకు 8–10 చొప్పున మిథైల్ యూజినాల్ లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి.

- నిమ్మ మరియు బత్తాయి

  - వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, అంబే బహార్ (సాధారణ సీజన్) పూతను ప్రోత్సహించడానికి మొక్కలను నీటి ఎద్దడికి గురిచేయాలి. అదేవిధంగా, ఆఫ్-సీజన్ (హస్తే బహార్) పూతను ప్రోత్సహించడానికి ప్రతి మొక్కకు రోజుకు 64–72 లీటర్ల నీటిని అందించాలి.

  - ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గజ్జి తెగులు వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున, నిమ్మలో గజ్జి తెగులు సోకకుండా ముందస్తు నివారణ చర్యగా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 WP @ 3 గ్రాములు / లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తోట పంటలు, సుగంధ ద్రవ్య మరియు ఔషధ మొక్కలు

- పసుపు మరియు అల్లం
  - నేలలోని తేమను బట్టి నీటిపారుదలను సర్దుబాటు చేయండి. బరువైన నేలలకు 2–3 సార్లు, తేలికపాటి నేలలకు 3–5 సార్లు నీటిని అందించవచ్చు.
  - పసుపు మరియు అల్లంలో నీరు నిలవకుండా, దుంపలు కుళ్ళిపోకుండా నివారించడానికి సరైన నీటి పారుదల వ్యవస్థను ఉండేలా చూసుకోవాలి.

- ఆయిల్ పామ్
  - ప్రస్తుతం నెలకొని ఉన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా, ప్రతి ఎకరానికి నెలకు 5 కిలోల యూరియా, 3 కిలోల DAP మరియు 10 కిలోల MOP ఎరువులను ఫర్టిగేషన్ ద్వారా అందించాలి.

  - రానున్న వారం రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నందున, ముదురు ఆయిల్ పామ్ తోటల్లో ప్రతి మొక్కకు రోజుకు 220–270 లీటర్లు, లేత ఆయిల్ పామ్ తోటల్లో ప్రతి మొక్కకు రోజుకు 110–140 లీటర్ల నీటిని అందించాలి.

పూలు

- చామంతి (మొగ్గ తొడిగే దశ నుంచి పూత దశ వరకు)
  - పొడి మరియు వెచ్చని వాతావరణంలో పేనుబంక, తామర పురుగులు మరియు ఆకు తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరాకు 10–12 పసుపు/నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. రసం పీల్చే పురుగుల ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని దాటితే, నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8% SL @ 0.3 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 5% SC @ 1.5–2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
  - చల్లని రాత్రులు మరియు ఉదయం వేళల్లో ఏర్పడే మంచు కారణంగా బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. బూడిద తెగులు నివారణకు ఉదయం వేళల్లో నీటిలో కరిగే గంధకం (వెట్టబుల్ సల్ఫర్) @ 2–3 గ్రా. లేదా హెక్సాకొనజోల్ @ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
  - పూల నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి బాగా విచ్చుకున్న పూలను వేకువ జామునే కోయాలి.

- బంతి (శాఖీయ దశ నుంచి పూర్తి పూత దశ వరకు)
  - కింది ఆకులు రాగి రంగులోకి మారడం లేదా ఆకులపై సాలెగూడు లాంటి నిర్మాణం ఏర్పడటం అనేది పొడి వాతావరణంలో ఎర్ర నల్లి (టూ-స్పాటెడ్ స్పైడర్ మైట్) ఆశించినట్లు సూచిస్తుంది. వీటి నివారణకు ప్రొపార్గైట్ 57% EC @ 1.5–2 మి.లీ. లేదా స్పిరోమెసిఫెన్ @ 0.7 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.